క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం నిర్వహించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం అనంతరం సర్వ దర్శనాలు ఏర్పాటుచేశారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

చలివేంద్రం ప్రారంభం



పుచ్చకాయలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

పెందుర్తి: పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రజల దాహార్తి తీర్చేందుకు స్థానిక నాయకుడు వేగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. తొలిరోజు వెయ్యి మందికి పుచ్చకాయలు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తన తండ్రి వేగి పెద ఆదినారాయణ పేరుతో గత 17 సంవత్సరాలుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేసవి ముగిసే వరకు చలివేంద్రం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు జుత్తాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

పెందుర్తి: మండలంలోని వాలిమెరక జుత్తాడలో భీమ్‌రావ్ రాంజీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9 గంటలకు అతిథుల చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని వెల్లడించారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

సబ్బవరం: మండలంలోని పెదగొల్లలపాలెం లోని చిన్మయమిషన్, గ్రామీణ వికాస కేంద్రంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్వామి రఘువీర నంద సరస్వతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ స్టీల్ జనరల్ హాస్పిటల్, మెడికవర్ హాస్పిటల్ సంయుక్తంగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్పెషలిస్ట్ వైద్యులు మహిళలు, పురుషులలో బీపీ, జాయింట్ పెయిన్స్, ఉదర సంబంధిత వ్యాధులు, చర్మవ్యాధులకు సంబంధించిన పరీక్షలతో పాటు నేత్ర పరీక్షలు చేసి, చికిత్స అందిస్తారన్నారు. సాధారణ పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారన్నారు.

ఇద్దరు పర్యాటకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన పర్యాటకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతున్న ఇద్దరు పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ కాపాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌కు చెందిన ఆరుగురు పర్యాటకులు శనివారం మధ్యాహ్నం రుషికొండ బీచ్ వచ్చారు. స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఆయుష్ ఠాకూర్, సత్యం ఠాకూర్ కొట్టుకుపోతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ వీరిని గమనించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. పర్యాటకులను సురక్షితంగా కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

పండగల్లో జూదమాడితే కఠిన చర్యలు



సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: గ్రామాల్లో అమ్మవారి పండగలు, ఇతర కార్యక్రమాలు, వారాంతాల్లో పేకాట, కోడిపందాలు, గుండాట వంటి జూదమాడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి సతీష్‌కుమార్ హెచ్చరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్తిగా జూదాన్ని నిషేధించామన్నారు. పండగల్లో అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కూడా పూర్తిగా నిషిద్ధమని పేర్కొన్నారు. అమ్మవార్ల పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. బెట్టింగ్ వ్యవహారంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ఉద్యాన పంటల సాగు..బాగు

ఉద్యాన పంటలకు పెట్టింది పేరు పెందుర్తి నియోజకవర్గం. పెందుర్తి, పరవాడ, సబ్బవరం ప్రాంతాల్లోని పల్లెల్లో కూరగాయల పంటలు విరివిగా పండిస్తారు. ముఖ్యంగా పెందుర్తి ప్రాంతంలో ఆకుకూరలు పండిస్తే..సబ్బవరం మండలం కాయగూరల పంటలకు కేరాఫ్ అడ్రస్. ఈ ప్రాంతం నుంచే నగరానికి అధిక సంఖ్యలో కూరగాయలు, ఆకుకూరలు సరఫరా అవుతుంటాయి.

- వేసవిలో దిగుబడి పెంచేందుకు రైతులు సన్నద్ధం
- అధికాదాయం వచ్చే కూరగాయలపై దృష్టి
- తక్కువ పెట్టుబడితో ఆకుకూరల పంటలు లాభదాయకం
- సస్యరక్షణ చర్యలు తీసుకోవాలంటున్న అధికారులు



అమృతపురంలో క్యాబేజీ పంట



పెదగాడి సమీపంలో టమాటా పంట

పెందుర్తి: ఉద్యానవన పంటల సాగుకు అనుకూలంగా ఉండటంతో ఇక్కడి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం పెందుర్తి మండలంలోని 106 ఎకరాల్లో ఆకుకూరల పంట సాగవుతోంది. సబ్బవరం మండలంలో దాదాపు 500–600 ఎకరాల్లో కాయగూరల పంటలు వేశారు.

అన్ని పంటలకూ అనుకూలం

నియోజకవర్గంలోని పెందుర్తి, పరవాడ, సబ్బవరం ప్రాంతాల్లో అధికంగా ఎర్ర నేలలు ఉన్నాయి. ఈ నేలపై అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరల పంటలకు అనుకూలం. దీంతో బీర, బెండ, దొండ, గోరు చిక్కుడు, వంగ, బీన్స్, బరబాటి, క్యాబేజీ, క్యాప్సికమ్, టమాటా, మిర్చి, ఆనప, క్యారెట్, ముల్లంగి తదితర పంటలతో పాటు తోటకూర, గోంగూర, బచ్చలి కూర, చుక్క, పాలకూరలు వేసుకోవచ్చు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా క్యాబేజీ, దొండ, వంగ పంటలు వేసుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు.



చింతలగ్రహారంలో కొత్తిమీర పంట

సస్యరక్షణ చర్యలు

- వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సస్య రక్షణపై ఉద్యానవన శాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు.
- సాధారణంగా కూరగాయల పంటల కోసం నారుమడి నుంచే నేలను సారవంతం చేయాలి. పంట వేయడానికి కొద్ది రోజుల ముందు సేంద్రియ ఎరువులు మట్టిలో కలిపితే సారం పెరుగుతుంది.
- ఉద్యాన పంటలకు నారుదశ చాలా కీలకం. నారు ఆరోగ్యకరంగా ఉంటేనే పంట ఎదుగుదల, దిగుబడి బావుంటుంది. అందుకోసం నారు దశలో బయోటాక్సిన్ మందులు వాడాలి.
- నారు, మొక్కల దశలో తెగుళ్ళు సోకకుండా బయోఫంగీసైడ్ ఒక కిలో, వేపపిండి 10 కిలోలు, 90 కిలోల పశువుల పేడ కలిపి పొలంలో చల్లాలి.
- సాధారణంగా కూరగాయలు/ఆకుకూరల పంటకు కుళ్లతెగులు, ఎండు తెగులు, ఆకుమచ్చ తెగుళ్లతో పాటు, రసం పీల్చే పురుగుల నుంచి బెడద ఉంటుంది. దీన్ని నివారించేందుకు బైటాక్సిన్ మందు చల్లాలి.
- కూరగాయలు.. ముఖ్యంగా ఆకుకూరలు ప్రజలు నేరుగా తినేవి కాబట్టి ఎక్కువ మోతాదులో రసాయనాల వాడకం మంచిది కాదు. సేంద్రియ ఎరువులు ముఖ్యంగా వేపపిండి, వేపనూనెల మిశ్రమాలను వాడడం వలన తెగుళ్ల సత్వర నివారణతో పాటు ఖర్చు కూడా తగ్గుతుంది.



సబ్బవరంలో పూతదశలో ఉన్న వంగతోట

చందనోత్సవానికి బస్సులన్నీ కండిషన్‌లో ఉండాలి

ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు



మెకానికల్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న అప్పలనాయుడు

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం డిపో నుంచి తిరిగే బస్సులన్నీ కండీషన్‌లో ఉండేలా చూడాలని ఆర్టీసీ విశాఖ రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు అధికారులను ఆదేశించారు. సింహాచలం డిపోను శనివారం సందర్శించిన ఆయన మాట్లాడుతూ చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం డిపో 51బస్సులను నడుపుతుందని తెలిపారు. వీటిలో 35బస్సులు కొండదిగువ గోశాల నుంచి సింహగిరిపైకి, పది బస్సులు పాత అడవివరం నుంచి కొత్త టోల్‌గేట్ మీదుగా తిరుగుతాయన్నారు. ఆరు బస్సులు శ్రీనివాసనగర్ నుంచి అడవివరం వరకు తిరుగుతాయని తెలిపారు. దేవస్థానం ముందుగా ఆ బస్సులకు నగదు చెల్లిస్తుండటంతో ఉచిత ప్రయాణమే భక్తులకు ఉంటుందని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా బస్సులను కండిషన్‌లో ఉంచాలని మెకానికల్ సిబ్బందిని ఆదేశించారు. ఫిట్‌నెస్ సర్టిపై చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్లు నాయుడు, కొండలరావు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.ఎస్.రావు, ఇక్బాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు ఇంటింటి ప్రచారం



ఏకలవ్య కాలనీలో విద్యార్థి తల్లిదండ్రులను కలిసిన రాంపురం హైస్కూల్ ప్లస్ అధ్యాపకులు

పెందుర్తి: మండలంలోని రాంపురం జిల్లాపరిషత్ హైస్కూల్ ప్లస్‌లోని బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు సంబంధించి పాఠశాల అధ్యాపకులు, స్కూల్ అసిస్టెంట్లు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కె.జయప్రసాద్ ఆధ్వర్యంలో వీరు ఏకలవ్యకాలనీ, పెదగాడి, పినగాడి, చింతల అగ్రహారం, గొరపల్లి, బాపూజీ కాలనీల్లో రెండు బృందాలుగా పర్యటించి, తల్లిదండ్రులు, విద్యార్థులను కలిశారు. కాలేజీలో పూర్తి వసతి సౌకర్యాలు, డిజిటల్ టీచింగ్, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, మధ్యాహ్న భోజనం సౌకర్యంతో పాటు, బాలికలకు ప్రత్యేక భద్రత కల్పిస్తున్నట్లు వివరించారు. దీనిపై తల్లిదండ్రులు సానుకూలంగా స్పందించి రాంపురం హైస్కూల్ ప్లస్‌లోని బాలికల కాలేజీలో తమ పిల్లలను చేర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీవీ శ్రీనివాస్, కె.వెంకటరావు, ఎస్‌వీజీ రామారావు, సీహెచ్.రాజేశ్వరి, కె.శ్రీదేవి, ఎస్.ఎస్.బీబీ, కె.చక్రవర్తిదేవ్, వి.సతపతి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల హెచ్ ఎంలను కలిశారు. మొదటి రోజు ఇద్దరు విద్యార్థులను చేర్పించామని హెచ్‌ఎం కె.జయప్రసాద్ తెలిపారు. ఉన్నత పాఠశాలలో 6నుంచి 10తరగతుల్లో ప్రవేశాలకు చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు.

శోభాయాత్రకు తరలిన భక్తులు



శోభాయాత్రకు వెళ్తున్న గొర్లె రామునాయుడు, భక్తులు

పెందుర్తి: హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన శోభాయాత్రకు పెందుర్తి నుంచి భారీగా భక్తులు తరలివెళ్లారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో 300 బైక్‌లతో యాత్రకు ర్యాలీగా వెళ్లారు. 'జై శ్రీరామ్ .. జై హనుమాన్' నినాదాలతో పెందుర్తి ప్రాంతం మార్మోగింది.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.2 లక్షల విరాళం



దాత వసంతరావుకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్



సూపరింటెండెంట్ విక్రమ్‌కు చెక్కు అందిస్తున్న దాత మహదేవ్ శ్రీధర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని మధురవాడకు చెందిన దరువూరి వసంతరావు లక్ష రూపాయల విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్‌ని అందజేశారు. అలాగే అక్కయ్యపాలెంలోని అబిడ్‌నగర్‌కి చెందిన మహదేవ్ శ్రీధర్ లక్ష 116 విరాళాన్ని చెక్కురూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం , శేషవస్త్రాలను అధికారులు అందించారు.

గ్రావెల్ తవ్వకాలతో 800 ప్లాట్లు మాయం

హౌసింగ్ ఛైర్మన్ తాతయ్యబాబు



గంగవరంలో గ్రావెల్ క్వారీలను పరిశీలిస్తున్న బత్తుల తాతయ్యబాబు తదితరులు

సబ్బవరం: గంగవరంలోని లేఅవుట్లో గ్రావెల్ అక్రమ తవ్వకాల వల్ల 800 వరకు ప్లాట్లు కనిపించడం లేదని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు తెలిపారు. మండలంలోని జీవీఎంసీ పరిధిలోని గంగవరంలో నిర్మాణంలో ఉన్న అర్బన్ హౌసింగ్ లే అవుట్లను ఆయన శనివారం పరిశీలించారు. కొంతకాలంగా అక్రమంగా గ్రావెల్‌ను తరలించుకుపోతున్న అర్బన్ హౌసింగ్ లే అవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రావెల్ తవ్వకాల ద్వారా గంగవరంలో 7130 ప్లాట్లకు 800 ప్లాట్లు, నంగినారపాడులో 6522 ప్లాట్లకు 150 ప్లాట్లు, గొల్లలపాలెంలో 5,250 ప్లాట్లకు గాను 90 ప్లాట్లు, పైడివాడ అగ్రహారంలో 8,300 ప్లాట్లకు 200 ప్లాట్లు కనిపించడం లేదన్నారు. ఈ లే అవుట్లలో విద్యుత్ హెచ్‌టీ లైన్లను కూడా విడిచిపెట్టకుండా తవ్వకాలు చేపట్టారని తెలిపారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై వివరాలను సేకరించి ప్రభుత్వానికి సమ గ్ర నివేదిక అందజేస్తామన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లి పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.

జూన్ నాటికి 3 లక్షల ఇళ్లలో గృహప్రవేశం

వచ్చే జూన్ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల ఇళ్లల్లో గృహ ప్రవేశాలు చేపట్టడం లక్ష్యంగా నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయని తాతయ్యబాబు తెలిపారు. హౌసింగ్ ఈఈ ఎ.శ్రీనివాసరావు, డీఈ సూర్యారావు, ఏఈ నాయుడు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడికి జాక్‌పాట్

వలకు చిక్కిన నల్ల చందువాలు



హార్బర్‌లో వలకు చిక్కిన నల్ల చందువాలు

మహారాణిపేట: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో శనివారం సందడి నెలకొంది. వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు ఊహించని సంఖ్యలో నల్ల చందువాలు చిక్కాయి. మార్కెట్‌లో మంచి డిమాండ్, అధిక ధర పలికే ఈ చేపలు ఒకేసారి పెద్ద మొత్తంలో లభించడంతో మత్స్యకారుడు మూగి రాముడు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఇన్ని చేపలు ఒకేసారి లభించలేదని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఈ చేపలకు విశేషమైన గిరాకీ ఉండటంతో, స్థానిక వ్యాపారులు కూడా వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు.

గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు



సిహెచ్.శిరీష (970, బైపీసీ



బి.మౌనిక 965, ఎంఈసీ



మల్లెల తేజస్వి 954,



కె జగదీష్ 915, సీఈసీ



నంబారు సిరి 941, బైపీసీ



మధులత 924, బైపీసీ



పినిశెట్టి శ్రావణి 959. ఎంపీహెచ్‌డబ్ల్యూ



పి.సుప్రియ (482) సీఈసీ ఫస్ట్ ఇంటర్,



ఎల్.కామేశ్వరి (454/470) ఫస్టియర్ ఎంపీసీ



సుగుణ (460/470) ఫస్టియర్ ఎంపీసీ



యలమల లోకేష్ 456/500 ఫస్టియర్ ఎంఈసీ



గజ్జి లలిత 419/440 ఫస్టియర్ బైపీసీ



వరలక్ష్మి 409/440 ఫస్టియర్ బైపీసీ

పరవాడ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో గురుకుల పాఠశాలలు మంచి ఫలితాలు సాధించాయి. తానాంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 133 మంది హాజరు కాగా 122 మంది ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని తెలిపారు. ఎంపీసీ విద్యార్థిని వి.ధనసంజన 980, బైపీసీ విద్యార్థిని సీహెచ్.శిరీష 970 మార్కులు సాధించారు. ఎంఈసీ విద్యార్థిని బి.మౌనికకు 965, సీఈసీ విద్యార్థిని ఎం.మౌనికకు 946 మార్కులు వచ్చాయి.

- మొదటి సంవత్సరం పరీక్షలకు 151 మంది విద్యార్థులు హాజరు కాగా 144 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్ట్ ఇంటర్‌లో సీఈసీ విద్యార్థిని పి.సుప్రియ 500 మార్కులకు గాను 482 మార్కులు సాధించింది. ఎంపీసీలో ఎల్.కామేశ్వరి 470 మార్కులకు 454 సాధించింది.

జెడ్పీ హైస్కూల్ ప్లస్ 2 లో..

పరవాడ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల(ప్లస్)లో ఈ ఏడాది ఫస్ట్ ఇంటర్ పరీక్షలకు 19 మంది విద్యార్థినులు హాజరు కాగా 8 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇంటర్ పరీక్షలకు 26 మంది హాజరు కాగా 13 మంది ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం రాజశ్రీ తెలిపారు. బాలికల పాఠశాలకు చెందిన ఫస్ట్ ఇయర్ విద్యార్థిని కర్రి భారతి 410/500 , సెకండ్ ఇయర్ విద్యార్థిని మాసవరపు నందిని 854/1000 మార్కులు సాధించింది.

జూనియర్ కళాశాలలో 95 శాతం..

పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండ్ ఇంటర్ పరీక్షలకు 143 మంది హాజరు కాగా 137 మంది ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు చెప్పారు. సెకండ్ ఇంటర్ విద్యార్థిని మల్లెల తేజస్వి 954/1000 మార్కులు సాధించిందని తెలిపారు. ఈ ఏడాది ఫస్ట్ ఇంటర్ పరీక్షలకు 149 మంది విద్యార్థులు హాజరు కాగా 66 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్ట్ ఇంటర్ విద్యార్థిని అండిబోయిన సుగుణ 460/470 మార్కులు సాధించింది.

సబ్బవరం గురుకులంలో శతశాతం ఉత్తీర్ణత

సబ్బవరం: సబ్బవరం మండలంలో ఇంటర్ సెకండియర్ ఫలితాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు 16మంది పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. వెయ్యి మార్కులకు గాను కోటాన జగదీష్ 915 (సీఈసీ), సారిక జశ్వంత్ 836 (ఎంఈసీ), బుకా ఆకాష్ రాజు 836 (ఎంఈసీ) మార్కులు సాధించారన్నారు.

- మొదటి సంవత్సరానికి సంబంధించి 33 మంది విద్యార్థులు హాజరు కాగా 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావడంతో 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. యలమల లోకేష్ 456/500(ఎంఈసీ),గోర ఆదిత్య 429/500(సీఈసీ) మార్కులు సాధించారన్నారు.

కేజీబీవీలో 94శాతం ఉత్తీర్ణత

సబ్బవరం కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ నుంచి 33 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 31 మంది ఉత్తీర్ణులయ్యారని, 94శాతం ఉత్తీర్ణత సాధించారని కేజీబీవీ ప్రత్యేకాధికారి మృదుల తెలిపారు. నంబారు సిరి 941,ఇంజరపు మధులత 924,షేక్ రిజ్వానా 910 మార్కులు సాధించారన్నారు.

- ఇంటర్ ఫస్టియర్‌కు సంబంధించి 31 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, 97 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. గజ్జి లలిత 419/440 మార్కులు, కురస వరలక్ష్మి 424/440 మార్కులు, కె.ఎర్నమ్మ 409/440 మార్కులు, నాగిరెడ్డి భవానీ 407/440 మార్కులు సాధించినట్లు చెప్పారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 88శాతం

సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 259 మంది విద్యార్థులు హాజరు కాగా 221 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, 88 శాతం ఉత్తీర్ణత సాధించామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీవీఎస్ మూర్తి తెలిపారు. ఒకేషనల్ నుంచి పి.శ్రావణి 959 (ఎంపీహెచ్‌డబ్ల్యూ), కె.జయశ్రీ 943(బైపీసీ) మార్కులు సాధించారన్నారు.

- ప్రథమ సంవత్సరం పరీక్షలకు 240 మంది విద్యార్థులు హాజరు కాగా 171 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావడంతో 71 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఒకేషనల్ నుంచి జి.లావణ్య 485/500 (ఎంపీహెచ్‌డబ్ల్యూ), ఎస్.రోహిణి 410/440(బైపీసీ) మార్కులు సాధించినట్లు తెలియజేశారు.

సింహాచలం గురుకులంలో 90.9శాతం ..

సింహాచలం: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో సింహాచలంలోని మహాత్మా జ్యోతీబా పూలే ఏపీ బీసీ సంక్షేమ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 90.9శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అసిస్టెంట్ ప్రిన్సిపాల్ చిరంజీవి తెలిపారు. ఎంపీసీ నుంచి 40మంది హాజరు కాగా.. 40మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. బైపీసీ నుంచి 15మందికి గాను 11మంది, సీఈసీ నుంచి 24మందికి 20మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఎంపీసీలో బి.కేశవ 962, బైపీసీలో రవితేజ 935, సీఈసీలో సీహెచ్.ధనరాజ్ 939మార్కులు సాధించారు.

- ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 80.37శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అసిస్టెంట్ ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఎంపీసీ నుంచి 62 మందికి 52మంది, బైపీసీ నుంచి 22మందికి 16మంది, సీఈసీ నుంచి 23మందికి 18మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఎంపీసీలో హరనాథ్ 460మార్కులు, బైపీసీలో సురేష్ 424మార్కులు సాధించినట్లు తెలియజేశారు.

సింహగిరిపై 'వసంత' హేల

గంగధార వద్ద అప్పన్న ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు





రంగులు జల్లుకుంటున్న అర్చకులు



ఉత్సవంలో పాల్గొన్న దేవస్థానం ఈవో సుబ్బారావు తదితరులు

సింహగిరిపై అప్పన్న వార్షిక కల్యాణోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా 6వ రోజు శనివారం ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం వైభవంగా జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని, గంగధార వద్ద స్నానాలాచరించారు. - సింహాచలం